
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6, కనిష్ఠం 14.1





• నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు



• ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు (ఫైల్)

కీలక సమయంలో సమ్మె బాట

- విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె
- కేజీబీవీలు, భవిత కేంద్రాల్లో నిలిచిన విద్యా బోధన
- 14 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్న ఉద్యోగులు
- విద్యాశాఖ కార్యాలయాల్లో పూర్తిగా స్థంభించిన పాలన
- జిల్లా వ్యాప్తంగా 896 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఇవీ డిమాండ్లు..

- సర్వీసును క్రమబద్ధీకరించాలి
- తక్షణమే కనీస వేతనం, పేస్కేల్ అమలు చేయాలి
- జీవిత, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలి
- ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి
- ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద రూ.25లక్షలు అందించాలి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చదువులు కీలక సమయంలో ఉన్న వేళ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ సమ్మెబాట పట్టారు. జిల్లాలోనూ 14 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు పాత కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్నారు. దీంతో కేజీబీవీలు, భవిత కేంద్రాలలో బోధన పూర్తిగా నిలిచిపోయింది. బోధన సిబ్బందే కాకుండా బోధనేతర సిబ్బంది కూడా సమ్మెబాట పట్టడంతో విద్యాశాఖ కార్యాలయాల్లో పూర్తిగా పాలన స్తంభించింది. మండల విద్యావనరుల కేంద్రాలు, జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, ఏపీవోలు, డేటా ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీవోలు, సీఆర్పీలు, అటెండర్లు, మెస్సేంజర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, భవిత సెంటర్లలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీలు సమ్మెలో పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 896 మంది సిబ్బంది సమగ్ర శిక్షాలో పనిచేస్తున్నారు. వీరంతా సమ్మెబాట పట్టడంతో పూర్తిగా పాలన స్థంభించింది.

896 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు..

జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్‌లో 896 మంది సిబ్బంది పనిచేస్తుండగా వారంతా 14 రోజులుగా సమ్మెబాట పట్టారు. వీరిలో కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది 571 మంది ఉండగా, యుఆర్ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది 10 మంది, డీపీవో సిబ్బంది 9మంది, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు 22 మంది, సీసీవోలు 29 మంది, సీఆర్పీలు 94 మంది, ఐఈఆర్‌పీలు 35మంది, మెస్సేంజర్లు 19 మంది, పీటీఐలు 88మంది, సీజీవీలు 19మంది ఉన్నారు.

కేజీబీవీలలో నిలిచిన బోధన

సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులు జిల్లాలోని కేజీబీవీలలో పనిచేస్తున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం సమ్మెబాట పట్టడంతో కేజీబీవీలలో విద్యాబోధన పూర్తిగా అటకెక్కింది. జిల్లాలో 27 కేజీబీవీలు ఉండగా సుమారు 6,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు సైతం చదువుకుంటున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం 571 మంది సమ్మె చేస్తుండటంతో తరగతులు నిలిచిపోయాయి. ఒకరిద్దరు ఉపాధ్యాయులను కేజీబీవీలకు సర్దుబాటు చేస్తున్నప్పటికీ ఆశించినమేర విద్యాబోధన జరగడం లేదు. మండల విద్యాశాఖ కార్యాలయాల్లో సీఆర్పీలు, సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో యుడైస్, మధ్యాహ్న భోజన బిల్లులు నిలిచిపోయాయి. బియ్యం పంపిణీ, బడిబయట ఉన్న చిన్నారుల గుర్తింపు, రాగి జావ, తదితర కార్యకలాపాలన్నీ సమగ్ర శిక్షా ఉద్యోగులే నిర్వహిస్తుండటంతో అవన్నీ నిలిచిపోయాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కూడా సమగ్ర శిక్షా ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ట్, డ్రాయింగ్, వ్యాయామ విద్య తదితర ప్రత్యేక ఉపాధ్యాయులు కూడా సమ్మెబాటలో ఉండటంతో వారి బోధన కూడా నిలిచిపోయింది. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సైతం సమ్మెబాట పట్టారు. పదో తరగతి విద్యార్థులకు ఈ సమయం కీలకం కానుండగా ఇంటర్మీడియెట్ విద్యార్థులు సైతం కేజీబీవీలలో చదువుతున్నారు. పరీక్షలకు మూడు నెలల సమయమే ఉండటంతో ఉద్యోగుల సమ్మె వారి చదువులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ..

సమగ్ర శిక్షా ఉద్యోగులకు గతంలో ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడంతో సమ్మెబాట పట్టారు. కాగా, శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకోసం 14 రోజులుగా నిరసనలు, సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేష్ తదితరులు సమ్మెకు సంఘీభావం తెలిపారు.

14 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదు..

: రాజు, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు



14 రోజులుగా మా సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం. 20 ఏళ్లుగా సమగ్ర శిక్షాలో చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో 25 రోజుల పాటు సమ్మె చేశాం. అప్పటి పీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మా సమ్మెకు హాజరై సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఏడాది గడిచినా హామీలను నెరవేర్చకపోవడం దారుణం. పరిష్కరించాలి. లేదంటే సమ్మెను తీవ్రతరం చేస్తాం.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి..

: సుప్రజ, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ, నిజామాబాద్



సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి. అతితక్కువ వేతనాలతో 20ఏళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం దారుణం. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు కనీస వేతనం ఇవ్వాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలి. లేదంటే సమ్మెను తీవ్రతరం చేస్తాం.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

విరివిగా పంట రుణాలు ఇవ్వాలి

• జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని, ప్రత్యేకించి యాసంగి సీజన్‌లో పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ అంకిత్ బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రస్తుత యాసంగిలో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా ఆయన సమీక్షించారు. ఈయేడాది ఖరీఫ్‌లో రూ.2640 కోట్లు పంట రుణాలుగా అందించాలనే లక్ష్యం కాగా 2285.25 కోట్లు పంపిణీ చేసి 86.56 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు అందరూ చొరవ చూపాలన్నారు. యాసంగిలో రూ.1762.74 కోట్ల రుణలక్ష్యాన్ని అధిగమించాలన్నారు. గత 2023-24 ఆర్థిక సంవత్సరంలో

మిగతా 6వ పేజీలో...



సమావేశానికి హాజరైన బ్యాంకర్లు, ఉద్యోగులు

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే
కేటీఆర్‌పై కేసు నమోదు

- రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు
- సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుల దుష్ప్రచారం
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

6



తుప్పుబడుతున్న కార్పొరేషన్ వాహనాలు

- షెడ్డులకే పరిమితమైన నగర పాలక సంస్థ వాహనాలు
- సంవత్సరానికి పైనే మూలన పడి ఉన్న వాహనాలు
- నగరపాలక సంస్థ నిర్లక్ష్యంతో లక్షల రూపాయలు వృథా



సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నగర పాలక సంస్థ పాలకులు లక్షల రూపాయలను వెచ్చించి అత్యాధునిక వాహనాలను కొనుగోలు చేశారు. మనుషుల అవసరం లేకుండానే అత్యాధునిక వాహనాలతో చెత్తను ఏరవేసే యంత్రాలను కొనుగోలు చేశారు. అయితే వాటిని అవసరమైనంత మేర వినియోగంచడం లేదు. చిన్న చిన్న రిపేర్లు చేసుకోకపోవడంతో వాహనాలు షెడ్డుకే పరిమితమై తుప్పు పట్టిపోతున్నాయి. సంవత్సరాలుగా షెడ్డులకే పరిమితం కావడంతో వాటి రిపేర్ల కోసం లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో సంవత్సరాల తరబడి వృథాగా ఉండిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన సిక్కింగ్ మిషన్, జడ్‌టింగ్ మిషన్‌లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో షెడ్డుకే పరిమితం అయ్యాయి. వీటి మరమ్మతుల కోసం సుమారు 5లక్షల రూపాయలు అవుతుందని సమాచారం. వీటికి తోడు స్వీపింగ్ మిషన్‌లు సైతం మరమ్మతులు చేయాల్సి ఉండటంతో అవికూడా షెడ్డులకే పరిమితమై తుప్పుపట్టిపోతున్నాయి. నిధులు విడుదల చేయకపోవడంతో గత సంవత్సరానికి పైగా మరమ్మతులు లేక తుప్పుపట్టి పోతున్నాయి. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు వీటిపై దృష్టిపెట్టి వాహనాలకు మరమ్మతులు చేసి వినియోగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఏబీసీ సెంటర్ ఆవరణలో వృథాగా పడిఉన్న స్వీపింగ్, సిక్కింగ్ వాహనాలు



మహాపడి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా మహాపడి పూజ

• పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భజనలు, వేదపండితుల వేద మంత్రోచ్చరణలతో వైభవంగా అయ్యప్ప పడి పూజ నిర్వహించారు. వినాయక్‌నగర్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ శుక్రవారం భక్తిశ్రద్ధలతో సాగింది. వేదపండితులు బల్యపల్లి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడిపూజలో ధన్‌పాల్ వినయ్‌గుప్త, వంశీకృష్ణ, అయ్యప్పకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవభక్తితో దేశభక్తిని చాటుకునే విధంగా పూజలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. హిందూధర్మంలో భాగంగా వ్యక్తి యొక్క నడవడిక మానవ జీవన విధానం భక్తిమార్గంలో నడవడానికి అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి మనిషి తన జీవితంలో అయ్యప్ప దీక్ష తీసుకోవడంతో మానవ జన్మ పరిపూర్ణమవు తుందన్నారు. తన కుటుంబం నుంచి 20ఏళ్లుగా అయ్యప్ప దీక్ష తీసుకోవడం ఆనవాయితీగా వస్తుందని, తాము చేసుకున్న పూర్వ జన్మ సుకృతంగా అయ్యప్ప పూజ చేయడం భావిస్తున్నామన్నారు. అయ్యప్ప స్వాములు దీక్ష తీసుకున్న నాటి నుంచి కఠినమైన నియమని ష్ఠలతో దైవారాధనలో ఎలాగైతే ఉంటారో దీక్ష అనంతరం కూడా హిందూ ధర్మరక్షణ కోసం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఫార్ములా ఈ రేసు ద్వారా హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్

- సీఎం రేవంత్ రెడ్డి కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు
- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఫార్ములా ఈ కారు రేసును నిర్వహించి హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారాలు చేస్తోందని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫార్ముల ఈ కారు రేసులో అవినీతి జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయడంతో పాటు ఏసీబీకి అప్పగించారని ఆయన విమర్శించారు. ఫార్ముల ఈ రేసును నిర్వహించడం వల్ల హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో చేరిందన్నారు. ఇప్పటి వరకు లండన్, బీజింగ్, సియోల్, బెర్లిన్, సాంగయి, జకార్త వంటి నగరాల్లో మాత్రమే ఈ ఫార్ములా రేసులు జరిగాయన్నారు. ఫార్ములా రేసులను పర్యావరణ పరిరక్షణ కోసం, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్స హించేందుకే నిర్వహణ చేపట్టారన్నారు. గతంలో తమిళనాడు ప్రభుత్వం, యూపీ ప్రభుత్వం, ఒరిస్సా ప్రభుత్వం ఇలాంటి ఈవెంట్స్‌ను నిర్వహించాయన్నారు. హాకీ ప్రపంచ కప్ కోసం ఒరిస్సా ప్రభుత్వం రూ.260కోట్లు వెచ్చించిందన్నారు. ఫుట్‌బాల్ కోసం రూ.30కోట్లు కేటాయించిందన్నారు. ఫార్ములా 4 రేసింగ్ కోసం తమిళనాడు ప్రభుత్వం రూ.30కోట్లను వెచ్చించిందన్నారు. ఫార్ములా ఈరేస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి కూడా 700కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయలేదని ఆయన విమర్శించారు. సమస్యలు వచ్చిన ప్రతిసారి హైడ్రా, మూసీ అభివృద్ధి, లగచర్ల వంటి సంఘటనలను ముందుకు తీసుకువస్తున్నారని ఆయన ఆరోపించారు. హైడ్రా వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం భారీగా దెబ్బతిందన్నారు. లగచర్ల సంఘటనతో ఫార్మా కంపెనీలు ఇతర రాష్ట్రాలకు

మిగతా 6వ పేజీలో...

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

నిజామాబాద్	- 99490 55399
బోధన్	- 82476 24486
ఆర్మూర్	- 99085 21686
భీమ్‌గల్	- 87123 41176

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 99854 11454

బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451



హంగర్గఫారంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేడీఏ

పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారి

కోటగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారి వెల్లడించారు. పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జేడీఏ జగన్నాథ చారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే నూటికి 90శాతం ఆడ దూడలే పుడతాయని వివరించారు. గతంలో దున్న దాటిచ్చిన, కృత్రిమ గర్భధారణ చేయించిన అది ఆడ దూడనో, మగ దూడనో పుట్టేదన్నారు. ఈ శిబిరంలో 30 పశువులకు గర్భకోశ చికిత్సలు, రెండు కృత్రిమ గర్భధారణ, 5సాధారణ, 32 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సంస్థ అధికారి మజీద్ హైమద్, పశు సంవర్ధక శాఖ సహాయకులు బస్వారెడ్డి, పశువైద్యాధికారులు సురేష్, సంతోష్, ఏఎంసీ డైరెక్టర్ పవన్, పావని, పాల కేంద్రం చైర్మన్ కృష్ణా రెడ్డి, వెంకట్రాం రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గోపాల మిత్ర సూపర్‌వైజర్ తిరుపతి, గోపాల మిత్రులు రియాజ్, నాగేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా నీటి విడుదల

నవీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల సాగుకు సంబంధించి శనివారం అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేయడం జరుగుతుందని ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి తెలిపారు. కోస్లీ గోదావరి వద్ద ఉన్న స్టేజీ-1 పంప్‌హౌస్‌లో మధ్యాహ్నం 3గంటలకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. నవీపేట, రెంజల్, ఎడపల్లి, నిజామాబాద్, డిచ్‌పల్లి, మాక్లూర్ మండలాలకు చెందిన సుమారు 53,793ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని బోధన్ రూరల్‌లోని సంగెం, పెగడాపల్లి, ఊట్‌పల్లి, రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి, ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్న దృష్ట్యా నేడు మధ్యాహ్నం 3గంటల నుండి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నవీపేట: మండలంలోని యంచ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు యంచ 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా మండలంలోని యంచ, నందిగాం, అల్జాపూర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని, ఈ విషయంలో వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

కేటీఆర్‌ను అరెస్టు చేస్తే చూస్తూ ఊరుకోం

ముప్కాల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తీవ్ర ఆందోళన చేస్తామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మారుమూల ఈ కార్ రేసింగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ, హైదరాబాద్ ఈమేజ్‌ను పెంచిన మాజీమంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేయాలని చూస్తుందని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఉమా శంకర్, టి.రాజన్న, నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీడైరెక్టర్ కొమ్ముల మోహన్, బ్రహ్మాండండి లింగం, ముఖిద్, శ్రీనివాస్‌గౌడ్, సాజిద్, బద్దం చిన్న నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తీవ్ర ఆందోళన చేస్తామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్లెడ ఏలియా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మారుమూల ఈ కార్ రేసింగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ, హైదరాబాద్ ఈమేజ్‌ను పెంచిన మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేయాలని చూస్తుందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మహిపాల్, వాంకర్ శ్రీనివాస్, మామిడి రాజారెడ్డి, యుసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

● జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు



సన్మానం చేస్తున్న దృశ్యం

ధర్పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పద్మశాలిలు రాజకీయంగా ఎంతో వెనక బడ్డామని యువత రాజకీయాల్లో రాణించాలని జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు పుల్గం హన్మాండ్లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో గల పద్మశాలి భవనంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన పద్మశాలిల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలిలు సత్తా చాటాలన్నారు. నిరక్షరాస్యత, పద్మశాలిలు రాజకీయంగా వెనుకబడ్డారని, రాజకీయాల్లో రాణించినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. అన్ని మండలాల్లో మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు, బడ్డిలో యువతకు ప్రాధాన్యత నిస్తుందన్నారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ నందు, కార్యదర్శి కట్ట మోహన్, కోశాధికారిగా గోపి, ఉపాధ్యక్షుడిగా శంకర్, ఉపకార్యదర్శిగా నరేందర్‌లను నూతనంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా ప్రధానకార్యదర్శి మెరుగు శ్రీనివాస్, గంగాచరణ్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షుడు సామ నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు తప్పించుకునేందుకే కేసులు

భీమ్‌గల్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యాలను తప్పించుకునేందుకు ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టాలని చూస్తుందని, ఇందులో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై లేనిపోని కేసులు పెట్టాలని చూస్తూ విఫలమవుతుందని, దుర్మార్గపు ఆలోచనలు మానుకోవాలని, ప్రజలు బుద్ధిచెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీజడ్పీటీసీ రవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గున్నాల బాలభగత్, జిల్లా మాజీ కో ఆప్షన్ ఎంఏ మోహీజ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, కౌన్సిలర్‌లు, సతీష్‌గౌడ్, బోదిరె నర్సయ్య, మూత లింబాద్రి, నాయకులు చిన్నోల్ల రాజేశ్వర్, రహమాన్, బూక్యరాజునాయక్, బుక్య సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై దళితుల నిరసన

ఏర్గట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరుస్తూ చేసిన వాఖ్యలపై దళితులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నారపు రాజేశ్వర్, దిబ్బ సుదర్శన్, కుండ చక్రి, అట్ల పోషన్న, బంటు ప్రశాంత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద మాల మాదిగ యువజన నాయకులు శుక్రవారం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇటీవల పార్లమెంట్ సాక్షిగా రాజ్యంగా నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలను ఖండించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండల ఇన్‌చార్జీ అగ్గు క్రాంతి, పెండ బాస్కర్, ప్రదీప్, జాన్ సజన్, ప్రవీన్, భోజన్న, నవనీత్, అరుణ్ పాల్గొన్నారు.

భీమ్‌గల్: చట్టసభల సాక్షిగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే దళిత సంఘాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దళిత ఐక్య సంఘటన ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షుడు గడాల ప్రసాద్, రాజేందర్, శ్రీనివాస్, సునీల్, జెజె.నర్సయ్య, అనంతరావు, రమేష్, రతన్, అనిల్, గంగాధర్, అన్ని గ్రామాల దళిత సీనియర్ నాయకులు దళిత యువ నాయ కులు పాల్గొన్నారు.

పెర్కిట్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బీఆర్.అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యాలను ఖండిస్తూ శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యంగం ఆధారంగానే బీజేపీ నాయకులు పదవులు పొందారన్నారు. వెంటనే అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అయ్యప్ప శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, కొంతం మురళీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్నా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోర్తాడ్: అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యాలకు నిరసనగా మోర్తాడ్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. డీఎస్పీ, దళిత సంక్షేమ సంఘం, మోర్తాడ్ మండల అంబేద్కర్ యుజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు.

నందిపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం నల్లబ్యాడ్జిలు ధరించి కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆర్మూర్ నియోజకవర్గం అసెంబ్లీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్లమెంట్ సమావేశాల్లో అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలు చేసినందుకు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాయ కులు రెడ్డిగారి నిఖిల్, యూసుఫ్, గంగాధర్, ద్యావత్ లింగం, జమీల్, అశోక్ గౌడ్, గుండప్ప శంకర్, కొండూర్ దేవిదాస్, వైఎస్.గంగాధర్, పోశెట్టి, నసీర్ ఉన్నారు.

బోధన్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్రమంత్రి అమీత్‌షాను బర్తరఫ్ చేయాలని మాల మహనాడు జిల్లా అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లమయ్య, రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహనాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ, మాల మహనాడు బోధన్ డివిజన్ నాయకులు పాండు, మాల మహనాడు డివిజన్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యక్షులు కారంస్వామి పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: డాక్టర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం కమ్మర్‌పల్లిలో అంబెద్కర్ విగ్రహం ముందు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను మండల అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘంలఅధ్యక్షుడుసుంకరి విజయ్ కుమార్, కార్యదర్శి మేకల శ్రీకాంత్, గంగారాం, కొంటికంటి నరేందర్ పాల్గొన్నారు.



ఏర్గట్లలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల సభ్యులు



భీమ్‌గల్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దళితులు



మోర్తాడ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు



నందిపేటలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ఎడపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మండల కేంద్రంలోని నయాబాదిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపడుతున్న తీరును పరిశీలించి వివరాలను పంచాయితీ కార్యదర్శి నాగరాజు గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల కోసం ఏర్పాటు చేసిన యాప్‌లో సర్వే చేసిన వివరాలను సరిగా నమోదు చేయాలని, నమోదులో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని, ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శంకర్, ఏంపీఓ మన్‌మోహన్ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్, పంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. సరైన సమాచారం సేకరించి నమోదు చేయాలని, సర్వే అధికారులకు సూచించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ శేఖర్, రాజలింగం ఉన్నారు.



ఎడపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని బోధన్ తహసీల్దార్ విఠల్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఎడపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించి, ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో మాడ్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు, వైద్య సేవల గురించి ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కోసం వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సహిస్తా ఫిర్దౌస్, మండల అభివృద్ధి అధికారి శంకర్, ఎంపీవో మన్‌మోహన్ శాస్త్రి, ఆయుష్ వైద్యుడు వెంకటేష్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం రాత్రి హంగర్గ, కొప్పర్గ, సిద్దాపూర్ తదితర ప్రాంతాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికులకు వేతన బకాయిలను చెల్లించాలి

బోధన్‌రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు రావాల్సిన పీఆర్సీ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కల్యాణ మండపం వద్ద నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పారిశుధ్యం, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ తదితర విభాగాలలో పని చేస్తున్న కార్మికులకు గతంలో పెరిగిన పీఆర్సీని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 20వేల రూపాయల చొప్పున పెంచి ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు గంగామణి, రాజమణి, ఎల్లప్ప, రమా, విజయ, లావణ్య, మరియమ్మ, పోశవ్వ, సాయవ్వ పాల్గొన్నారు.

కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రెంజల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో కెమిస్ట్రి లెక్చరర్ పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హర్షియా నాజం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో సంప్రదించాలన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మెండోర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):. మండల కేంద్రంలో ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్దమైన బాధిత కుటుంబానికి శుక్రవారం పదవ తరగతి పూర్వవిద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులతో తోటి మిత్రులు అయిన సోదరి గృహం అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధం కావడంతో తోటి స్నేహితులు, మిత్రులు సోదరి కుటుంబానికి అండగా నిలిచి రూ.25వేలు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గుండోజి రవి, బాస్కర్, ప్రవీన్, సాయారెడ్డి, సదానంద్, చంద్రకాంత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మెండోర మండలంలో సావెల్ గ్రామానికి చెందిన అర్తిక్ కంటి సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరడంతో వైద్య ఖర్చుల కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించగా సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల 50 వేల ఎల్‌వోసీని అందించారు.

భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

ముప్కాల్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ప్రయోజనార్థం నిర్వహిస్తున్న ఉచిత భూసార పరీక్ష సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయ విస్తీర్ణ అధికారి రేష్మ తెలిపారు. శుక్రవారం బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామంలో భూసార పరీక్షల వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ నుంచి సాయిల్ హెల్త్ మెనేజ్‌మెంట్ పథకంలో భాగంగా మండలంలోని రైతులకు ఉచిత భూసార పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మరింత మంది రైతులు ముందుకు వచ్చి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల పోషక విలువలతో పాటు ఉదజని సూచిక, కర్బనశాతం ఇతరాత్ర సమస్యలు తెలుసుకోవ డానికి భూసార పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయని సూచించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వేల్పూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆర్మూర్ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఇంట్లో సిలిండర్ ద్వారా జరిగే అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిలిండర్ వాడే విధానం, సిలిండర్ ఫైర్ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఫైర్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిలిండర్ ఆన్ చేసి నిప్పు అట్టించగా మంటలు బయటకు రావడాన్ని తడిగుడ్డతో మంటలను ఏలా ఆర్పివేయలో ప్రత్యక్షంగా చూయించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వీణ, ఆసుపత్రి సిబ్బంది, ఫైర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు సంఘీభావం

ఏర్గట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయ మైన డిమాండ్‌ను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఫిజికల్ సైన్స్ యూపీ లెవల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు వారికి మద్దతు తెలుపుతూ సంఘీబావం తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వారికి న్యాయం చేయాలని కోరుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, మునీరుద్దీన్, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా ఫంక్షన్ హాల్ భవనానికి భూమిపూజ

ఏర్గట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం గ్రామ అభివృద్ధి కమిటీకి చెందిన సొంత భూమిలో ప్రజా పంక్షన్‌హాల్ భవనానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డీఎంఎఫ్ ఫండ్ ద్వారా 50 లక్షలు మంజూరు చేయగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునిల్ కుమార్ నిధులు రద్దు కాకుండా చొరవ చూపడంతో భవన నిర్మాణానికి పనులు చేయడానికి భూమిపూజ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కారు పాకల నర్సయ్య, కాషియర్ సోమ లింగారెడ్డి, వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, దండెవోయిన సాయి పాల్గొన్నారు.

చందూర్‌లో ఎరువుల గోదాం ప్రారంభం



గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

మోస్రా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలోని చందూర్ సొసైటీ పరిధిలోని మేడిపల్లి గ్రామంలో సొసైటీ చైర్మన్ అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్‌డీసీసీబీ బ్యాంకు చందూర్ మేనేజర్ వసంత నూతన గోదాంను ప్రారంభించారు. రైతులకు అందుబాటులో గోదాంను ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అశోక్ యాదవ్, సొసైటీ వైస్ చైర్మన్ తారాసింగ్, సొసైటీ డైరెక్టర్లు రాథోడ్ భజన్ లాల్, నీరడి బాలయ్య, అంగోత్ శంకర్, మేడిపల్లి సాయిలు, మేడిపల్లి మాజీ సర్పంచ్ రవి, మాజీ ఎంపీటీసీ శ్యామ్‌రావు, సొసైటీ సీఈవో భూమయ్య, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

చలి తీవ్రతతో యాచకుడి మృతి

వర్ని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలోని బడాపహాడ్ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వర్ని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 70 నుంచి 75సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి బడాపహాడ్ ఏరియాలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడని తెలిపారు. చలి తీవ్రత అధికంగా ఉండడం, ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. దర్గా సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

గుండెపోటుతో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

కోటగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసుల శ్రీనివాస్ గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. రాత్రి చాతిలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఏఎంసీ చైర్మన్ హన్మంతు, ఉపాధ్యక్షులు అనిల్, విండో అధ్యక్షులు కూచి సిద్దు, మాజీ ఎంపీపీ పవన్, నాయకులు మనోహర్, శ్రీనివాస్ రావుతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కోటగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ గంగాదర్ తనిఖీ చేశారు. జరీనా కాలనీ, మాలివాడ అంగన్‌వాడీ కేంద్రాలలో పలు రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ తదితరులున్నారు.

రెండు మొరం టిప్పర్ల పట్టివేత

బోధన్‌రూరల్,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న రెండు మొరం టిప్పర్లను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బోధన్ మండలం ఊట్‌పల్లి నుండి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు మొరం టిప్పర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న మొరం టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేనిదే మొరం తరలించవద్దని పేర్కొన్నారు. అక్రమంగా మొరం రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయబడతాయని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మంజీర సరిహద్దు నుండి అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రవాణా చేయాలన్నారు.

మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించాలి

● తండ్రి వేడుకోలు

బోధన్‌రూరల్,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): దేశం కాని దేశంలో చదువు కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో బోధన్ వాసి మృతి చెందిన ఘటన విదితమే. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ గౌడ్స్ కాలనీలో విషాదం నెలకొన్న సంఘటనపై మృతుడి తండ్రి శుక్రవారం మాట్లాడారు. ఉన్నత చదువుల కోసం అమెరికాలోని న్యూ హెవెన్ సిటీలో విద్యనభ్యసిస్తూ 16వ తేదీన బ్రిడ్జిపోర్ట్ ప్రాంతానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా తీవ్రంగా మంచు కురుస్తుండడంతో కారు అదుపు తప్పి తన కుమారుడు మృతి చెందాడని బాధతో వివరించారు. తన కుమారుడి మృతదేహాన్ని స్వదేశానికి త్వరగా రప్పించేలా సంబంధిత అధికారులు చూడాలని మృతుడు పంజాల నీరజ్ గౌడ్ తండ్రి శంకర్ గౌడ్ కోరారు. అమెరికాలో రోడ్డు ప్రమాదంలో బోధన్ పట్టణానికి పంజాల నీరజ్ గౌడ్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

ఎడపల్లి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు విధులపట్ల నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్ అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలోని వీణ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో ఉన్న బియ్యం, వంటపాత్రలను, కేంద్రం పరిసరాలను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ అంగన్‌వాడీ కేంద్రం సందర్శనకు వెళ్లిన సమయంలో అంగన్‌వాడీ టీచర్ అంగన్‌వాడీ కేంద్రంలో లేకపోయే సరికి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోతె గ్రామంలో సీఎం సహాయనిధి కింద ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

మోర్తాడ్: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్వాల మనోజ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పేదప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరంలాంటిదని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ చొరవతో పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయిస్తున్నారని ఆయన అన్నారు.

పద్యం పట్ల మక్కువ పెంపొందేలా బోధించాలి

» మూడవ రోజు పునశ్చరణ తరగతుల్లో అధ్యాపకులకు ప్రముఖ కవి గంద్ర లక్ష్మణ రావు సూచన

క్యాంపస్ కబుర్లు



మాట్లాడుతున్న ప్రముఖ కవి, విమర్శకుడు లక్ష్మణ్‌రావు



మాట్లాడుతున్న ప్రముఖ అనువాదకులు ఆనంద్

డిచ్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిలో పద్యం పట్ల మక్కువ పెంపొందేలా బోధించడంలో అధ్యాపకులు తమదైన శైలిలో చెప్పాలని ప్రముఖ కవి, విమర్శకుడు గంద్ర లక్ష్మణరావు సూచించారు. తెలంగాణ విశ్వ విద్యాలయం తెలుగు విభాగం, భారతీయ భాషా విభాగాల సంస్థ మైసూరు వారు తెలుగు అధ్యాపకుల పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు మొదటి ప్రసంగం గంద్ర లక్ష్మణ రావు, పద్య బోధన మెళకువలను, అద్వితీయంగా తెలియజేశారు. రెండవ ప్రసంగంలో వారాల ఆనంద్ ప్రముఖ అనువాదకులు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆనంద్ అనువాదం మెళకువలు అనే అంశంపై ప్రసంగించారు. అనువాదం అనేది నేడు బహుళ ప్రయోజనాన్ని కలిగి ఉందని సామాజిక మాధ్యమాలలో అనువాదం ప్రముఖ పాత్రను పోషిస్తుందన్నారు. మూడవ ప్రసంగంలో ప్రముఖ వచన రచయితావూరి సీతారామరావు వచ్చిన కవితా బోధన వ్యూహాలను గురించి ప్రసంగించారు. విద్యార్థికి తన చుట్టూ జరుగుతున్న ఒక అంశాన్ని ఇచ్చి దాని గురించి వారు అనుకుంటున్నా భావాలను మూడు నాలుగు పంక్తుల్లో రాసే విధంగా అధ్యాపకుడు మొదట ప్రయత్నం చేయాలని తద్వారా విద్యార్థుల్లో కవిత రచనను పెంపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలుగు అధ్యాపకులు కొత్త కోణంలో ఆలోచించి విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించాలని సూచించారు. కుటుంబం, సమాజం, సామాజిక స్పృహ అనే అంశాలను విద్యార్థికి అవగతం అయ్యేలా చెప్పినట్లయితే వారు సమాజాన్ని చూసే దృక్పథంలో మార్పు వస్తుందని ఆ మార్పే కవిత్వం రాసేలా చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య కె.లావణ్య, డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలను తనిఖీ చేసిన టీయూ వీసీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ యాదగిరి రావు

డిచ్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పీజీ పరీక్షలను వైస్ చాన్స్‌లర్ ఆచార్య టి.యాదగిరిరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ 1, 2వ సెమిస్టర్ రెగ్యూలర్ (థియరీ, ప్రాక్టికల్) పరీక్షలు ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యు, ఎంకాం, ఎంబీఏ, ఎంసీఏ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు (ఏపీఈ, పీసీహెచ్, ఐ ఎంబీఏ) మొదటి సెమిస్టర్ ఎల్‌ఎల్‌బీ) ఐదు సంవత్సరాల ఇంటి గ్రేటెడ్ కోర్సు (ఐఎంబీఏ), ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ పరీక్షలు విశ్వవిద్యాల యంలోని ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను వీసీ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వీసీతో పాటు అడిషనల్ కంట్రోలర్ బి.సాయిలు, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ రెడ్డి ఉన్నారు. ఈ రోజు జరిగిన పరీక్షలకు మొత్తం 151 మందికి గాను 148 మంది హాజరుకాగా 3 విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

జర దేఖో!!



ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద వాహనాలు



అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

» పోటాపోటీగా రహదారిని ఆక్రమిస్తున్న దుకాణదారులు » కమ్మర్‌పల్లిలో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారి 63పై తరుచు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారి పక్కనే ఇష్టానుసారంగా వాహనాలను నిలపడం, చిరు వ్యాపారులు, కురగాయల దుకాణాలు పోటాపోటీగా రోడ్డెక్కడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం భారీ వాహనాలు కురగాయల కొనుగోలు కోసమని జాతీయ రహదారిపైనే వాహనాలు నిలపడం, రోజువారి కురగాయలు కొనుగోలు దారులు తమ ద్విచక్ర వాహనాలను జాతీయ రహదారిపైనే నిలపడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలాఉండగా గ్రామంలోని పశువులు సైతం ఇదే రహదారిపై నుంచి అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లి సాయంత్రానికి తిరిగి ఇదే రహదారిపై నుంచి తిరిగిరావడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతూ పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడం తరుచు కనిపిస్తుంది. ప్రతీ శనివారం నిర్వహించే వారాంతపు సంతలో సైతం దుకాణాలు జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేయడంతో కొనుగోలు దారులు రోడ్డపై వాహనాలు నిలపడం రోడ్డుపై నుంచే తమకు కావలసిన సరుకులు కొనుగోలు చేస్తుండడంతో వాహనాలు స్పీడుగా వస్తూ ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. కరోనా సమయంలో అధికారులు దుకాణాలు రోడ్డుపైకి రాకుండా రహదారికి వంద మీటర్ల దూరం వరకు ఏర్పాటు చేయించారు. కాని వ్యాపారులు పోటాపోటీగా ముందుకు జరుగుతూ నిబంధనలు ఉల్లఘిస్తున్నా అటు పోలీసులు గాని, ఇటు పంచాయతీ పాలకవర్గం గాని ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు. వాహనదారులు వాపోతున్నారు. ఇదిలాఉండగా గ్రామంలో జాతీయ రహదారిపై డివైడర్లు ఏర్పాటు చేయడంతో యూటర్న్‌ల వద్ద భారీ వాహనాలు టీ, టిఫిన్, సెంటర్ల ముందు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు నిలపడంతో ప్రమాదాలకు దారి తీస్తున్న సంఘటనలు లేక పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డెకుతున్న చిరు వ్యాపారులను నియంత్రించాలని, రోడ్డుపక్కన వాహనాల నిలుపుదలను నిలువరిస్తూ జరుగబోవు పెను ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉందని గుర్తు చేస్తున్నారు.



జాతీయ రహదారిపైనే నిలిపిన వాహనాలు



జాతీయ రహదారిపై పశువులతో వాహనదారుల ఇబ్బందులు

శ్రీరామ స్వర్ణ పాదుకల పల్లకీ యాత్ర

భక్తి



ఆర్మూర్‌లో యాత్రను స్వాగతిస్తున్న అయ్యప్ప సేవా సమితి సభ్యులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంబి హన్మాన్ ఆలయం వరకు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ రామస్వర్ణ పాదుకల పల్లకి యాత్ర కొనసాగింది. ఈనెల 17న హైదరాబాద్ నుంచి ప్రారంభమైన పల్లకి యాత్ర అయోధ్యాలోని రామమందిరానికి చేరుకొని పాదుకలకు పూజలు నిర్వహించి తిరిగి హైదరాబాద్ చేరుకుంటామని అన్నారు. అనంతరం రాష్ట్రంలోని 13వేల గ్రామాలకు స్వర్ణపాదుకలను పంపడం జరుగుతుందని, తద్వారా లక్ష మందితో రామమాలధరణ ప్రారంభం చేయడానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి పట్టణ అధ్యక్షుడు పెంట జలందర్, రేగుల్ల సత్యనారాయణ, జనార్ధన్‌గౌడ్, మాసాల సత్యనారాయణ, మీసాల రాజేశ్వర్, చేపూర్ ధనుంజయ్, కోలు శేఖర్, ఉదయ్, గంగాధర్‌గౌడ్, రవి, నందు, రామరాజ్యం ట్రస్టు సభ్యులు దేవేందర్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, దర్శన్, రోహిత్ కుమార్, మహేందర్‌రెడ్డి, చైతన్యరెడ్డిలు పాల్గొన్నారు.

కమనీయం.. శివ పార్వతుల కల్యాణం



ఏర్గట్లలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ఏర్గట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ మందిర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవం శతాధిక ప్రతిష్ఠాపనాచార్యులు శ్రీ గురుమంచి చంద్రశేఖర్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు రాకేష్ పండితులు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కళ్యాణానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో తిలకించారు. సాయంత్రం పల్లికీ సేవ ప్రధాన వీధుల గుండా నిర్వహించగా మహిళలు మంగళహారతు లిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

బోధన్‌రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోధన్ తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ ఉద్యోగం కోసం ఓ వ్యక్తి ఫేక్ ఫ్యామిలీ సర్టిఫికేట్ తయారీలో ఈ సంతకం వాడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కోరారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

ముప్కాల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం మండల కేంద్రం శివారులో ఉన్న అనువైన ప్రభుత్వ భూములను ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ పరిశీలించిన స్థలాన్ని ఉన్నతాధికారులకు నివేదికను పంపి త్వరలోనే వివరాలు తెలియజేస్తామన్నారు. ఆయన వెంట పోచంపాడ్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిద్ధి రమేష్, కార్యదర్శి నేర నర్సయ్య, గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, సెక్రెటరీ సంజీవ్ థామస్, స్థానిక రెవెన్యూ సిబ్బంది గ్రామపెద్దలు టి.సాయన్న, గంగారాం, బాబురావు, కట్ట మహేష్, కట్ట గోపి, కంచు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్

అది పులి కాదు.. అడవి పిల్లి

● తేల్చేసిన అటవీ శాఖ పోలీసు అధికారులు ● భయపడవద్దని ప్రయాణికులకు సూచన



అడవి పిల్లి పాదాలను గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారి సుధాకర్, పోలీస్ అధికారులు



బజార్ కొత్తూర్ శివారులో సంచరించిన అడవి పిల్లి ఇదే

నందిపేట, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బజార్ కొత్తూర్, ఉమ్మెడ శివారు ప్రాంతంలో ఉన్న గుట్ట సమీపంలో పులి సంచరిస్తుందని అటు వైపు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలోని గ్రూప్‌లలో మెసెజ్ చేశారు. నందిపేట నుంచి బజార్‌కొత్తూర్, ఉమ్మెడ, మాయపూర్, బాద్గుణ గ్రామాలకు వచ్చే వారు ద్విచక్ర వాహనాలపై రావద్దని, కార్లలో వచ్చే వారు ఆచితూచి చూసుకుంటు రావాలని సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు పూర్తిగా వైరల్ అయ్యాయి. దీనికి స్పందించిన అటవీ శాఖ అధికారి సుధాకర్, సిబ్బంది అలాగే పోలీస్ శాఖ సిబ్బంది శుక్రవారం బజార్ కొత్తూర్, ఉమ్మెడ గ్రామశివారులో ఉన్న తారురోడ్డు గుట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. అది పులి కాదని, అడవి పిల్లి అని తేల్చేశారు. ప్రయాణికులు ఏటువంటి భయాందోళనకు గురికావద్దని కోరారు. పులి కాళ్ల పంజా సుమారు పది సెంటిమీటర్లు ఉంటుందని, అటవీ పిల్లి కారు పంజా మూడు సెంటిమీటర్ల కంటే ఎక్కువ ఉండదని తెలిపారు. అక్కడ పులి సంచరిస్తుందని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అడుగులను పరిశీలించారు. అడుగులు కేవలం ఏడు సెంటి మీటర్ల లోపే ఉన్నాయని అటవీ శాఖ అధికారులు తేల్చారు. నందిపేట నుంచి బజార్‌కొత్తూర్, బాద్గుణ, ఉమ్మెడ, మాయాపూర్, గ్రామాలకు వెళ్లి వచ్చే ప్రయాణికులు ఎటు వంటి భయాందోళన చెందవద్దని కోరారు.

మూడడుగుల బుల్లెట్టు

దూసుకుపోతున్న అభినవ్

» చెస్‌లో అద్భుత ఫలితాలు సాధిస్తున్న 4వ తరగతి విద్యార్థి » జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు
» ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు ఖాయమంటున్న తోటి క్రీడాకారులు



చెస్ ఆడుతున్న క్రీడాకారుడు అభిజిత్

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెస్ అనేది మేథావుల క్రీడ. మెదడుకు పని చెబితేనే ఫలితం ఉంటుంది. ఫలితం మొత్తం జ్ఞానంపైనే ఉండడంతో ఆ క్రీడను ఆడడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపరు. ఇండోర్ గేమ్ అయిన చెస్ క్రీడకు అంతర్జాతీయంగా మంచి పేరుంది. చెస్ క్రీడను నేర్చుకోవాలంటే కోచ్‌ల అవసరం కూడా చాలా ఉంటుంది. ఇవేవీ లేకుండానే జిల్లాకు చెందిన 4వ తరగతి కుర్రాడు అద్భుత ఫలితాలను సాధిస్తున్నాడు. మూడడుగుల బుడతడు తన వయస్సుతో సంబంధం లేకుండా ఎదుట ఎవరున్నా తన మేథో సంపత్తితో చదరంగం ఆడుకుంటున్నారు. చదరంగం ఆడుతుంటే చూసే వారు జిల్లా గుకేష్ అని పొగుడుతున్నారు. ఇటీవల చెస్ పోటీలు జిల్లాలో ఎక్కడ జరిగినా తనపేరే వినపడుతుంది. ఆ పేరే అభిజిత్.. నగరంలోని వీక్లీ బజార్‌కు చెందిన సాయన్న, అనూజల సుపుత్రుడు. నగరంలోని అభ్యాస పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి చదరంగంపై మక్కువతో ఆటను నేర్చుకున్నాడు. మొదట తన తల్లిదండ్రు లతో చదరంగం ఆడుతూ రాటు దేలాడు. వారిని కూడా ఆటలో ఓడించడంతో ఆన్‌లైన్‌లో చదరంగం ఆడి చెస్‌పై పట్టు సాధించాడు. ప్రతీ పోటీలో పాల్గొంటూ తన సత్తా చాటుతున్నాడు.



అభిజిత్ (ఫైల్)



అనూజ, అభిజిత్ తల్లి



సాయన్న, అభిజిత్ తండ్రి

తల్లిదండ్రుల ప్రోత్రాహంతో..

కరోనా సమయంలో ఇంటి పట్టునే ఉండడంతో ఫోన్‌లో చెస్ ఆడడం నేర్చుకున్నాడు. తల్లిదండ్రులు సైతం చెస్ ఆడడాన్ని ప్రోత్సహించడంతో చెస్‌లో మెళకువలు నేర్చుకున్నాడు. అంతేకాకుండా ఓ ప్రైవేట్ కోచింగ్ దగ్గర కొన్ని రోజుల పాటు చెస్ మెళకువలు నేర్చుకుని మరింత రాటుదేలాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు సాయన్న, అనూజలు పోటీలకు తీసుకువెళ్లి ప్రతిభను చాటేందుకు ప్రోత్సహించేవారు. పోటీల్లో సైతం గెలుస్తుండడంతో ప్రతీ పోటీలకు తల్లిదండ్రులు దగ్గరుండి తీసుకెళ్లి ఆడించేవారు. జిల్లాలో కాకుండా ఇతర ప్రాంతాలకు పోటీలకు తీసుకువెళ్లి అభిజిత్ చెస్‌లో ఎదగడానికి తోడ్పాటు అందిస్తున్నారు.

అభినవ్ సాధించిన విజయాలు

2020లో ప్రారంభించిన చెస్ ఆట విజయాలతోనే ప్రారంభమైంది. పాల్గొన్న ప్రతీ పోటీలో విజేతగా నిలిచి అందరినీ ఆశ్చర్య పర్చాడు. జిల్లాలో జరిగిన చెస్ ఎంపిక పోటీల్లో ప్రతిదాంట్లో విజేతగా నిలిచాడు. 2022లో జరిగిన అండర్ 15 పోటీల్లో 3 పాయింట్లు సాధించి ఔరా అని పించాడు. తనకన్నా పెద్దవారిపైన విజయం సాధించడంతో అందరి అంచనాలు అభిజిత్ పై పడ్డాయి. తర్వాత పోటీల్లో అండర్ 11 విభాగంలో జిల్లా చాంపియన్‌గా నిలిచాడు. అనంతరం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2024లో అండర్-15, అండర్-11 పోటీల్లో విజేతగా నిలిచాడు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో జిల్లా చాంపియన్‌గా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం తన సత్తాను చాటుతానని అభిజిత్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు. సీఎం కప్ పోటీల్లో సైతం తన కన్నా ఎక్కువ వయస్సు ఉన్న గ్రూప్‌ల వారితో తలపడి విజయం సాధించాడు.



నవీపేట బస్టాండ్‌లో ఇనుప పైపులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు ప్రవేశించకుండా పైపుల ఏర్పాటు

నవీపేట,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): నవీపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోకి ప్రైవేటు వాహనాలు ప్రవేశించకుండా శుక్రవారం అధికారులు దారికి అడ్డంగా ఇనుప పైపులను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే మేకల సంత రోజున సంతకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రైవేటు వాహనాలు, లారీలు, ట్రక్కులను బస్టాండ్ ప్రాంగణంలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. గత శనివారం నిజామాబాద్-2 డిపో మేనేజర్ సాయన్న ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలోకి ప్రైవేటు వాహనాలు రాకుండా సెక్యూరిటీ సిబ్బందితో కలిసి కట్టడి చేశారు. మండల కార్యాలయం నుండి బస్టాండ్ లోపలికి వచ్చే దారి వద్ద శుక్రవారం అధికారులు శాశ్వత ప్రతిపాదికన ఇనుప పైపులను బిగించారు. ఇకపై బస్టాండ్ ప్రాంగణంలోకి ప్రైవేటు వాహనాలు ప్రవేశిస్తే సంబంధిత వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హెచ్చరించారు.

పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయం

● అదనపు డీసీపీ బస్వారెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ క్రికెట్ టోర్నీ అభినందనీయమని అదనపు డీసీపీ బస్వారెడ్డి, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ అన్నారు. ఈ నెల 3 నుంచి 20 వరకు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వీరు మాట్లాడుతూ ఆటల పోటీల్లో కులాలకు, మతాలకు తావివ్వకుండా అందరూ స్నేహపూర్వకంగా ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే విధానాన్ని కొనసాగించాలన్నారు. ముఖ్యంగా క్రికెట్‌కు చాలా ఆధరణ ఉందని, ఆడినా, ఓడినా రెండు సమానంగా తీసుకోవాలన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తి చాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరు నచ్చిన క్రీడల్లో సాధన చేయాలని గత 18 రోజులుగా జిల్లాలో పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా జిల్లాలోని నలు మూలల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రాతినిధ్యం వహించారు. విజేత రన్నర్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి ఉన్నతంగా ఎదిగేలా క్రికెట్‌లో రాణించాలన్నారు. ప్రతినిత్యం ప్రాక్టీస్ చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విన్నర్, రన్నర్‌లకు ట్రోఫీలను, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు దయాకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు రత్నాకర్, ఎర్రం గంగాధర్, ఖుద్దూస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. విజేతగా ఆరెంజ్ ఆర్మీ రూ.25 వేల నగదు, ట్రోఫీ అందుకున్నారు. రన్నర్‌గా నిజామాబాద్ స్టార్ 15వేల నగదుతో పాటు ట్రోఫీ అందుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా శివ, బెస్ట్ బ్యాట్ మెన్‌గా శివ, బెస్ట్ బౌలర్‌గా చైనా రాజు, బెస్ట్ ఫీల్డర్‌గా జాఫర్, బెస్ట్ క్యాచ్‌గా మీర్జాలకు ట్రోఫీలను అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు డీసీపీ బస్వారెడ్డి

మాతా శిశు సంరక్షణ, క్రిటికల్ కేర్ యూనిట్లను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ, క్రిటికల్ కేర్ యూనిట్లతో కూడిన భవన సముదాయాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం సందర్శించారు. సుమారు 38.75 కోట్ల రూపాయలతో అన్ని హంగులతో అందుబాటులోకి తెచ్చిన ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లను ఈనెల 22న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభోత్సవం చేయనున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిప్లస్-4 అంతస్తులతో కూడిన ఈ భవన సముదాయంలో అందుబాటులోకి తెస్తున్న వివిధ విభాగాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వైద్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, ఇంజనీరింగ్ విభాగం ప్రవీణ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

22న జిల్లాకు రానున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

ఈనెల 22న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 9.40 గంటలకు హైదరాబాద్‌లోని ఆయన నివాసం నుంచి బయలుదేరి బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11గంటలకు నిజామాబాద్ నూతన కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రేంజల్‌లో పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు నిజామాబాద్‌లోని ఎంసిహెచ్ బిల్డింగ్ ప్రారంభిస్తారు. 2గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారు. 3గంటలకు కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 4.30 గంటలకు హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌లో తిరుగు ప్రయాణం అవుతారు.

విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధితుల కోసం విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయం జూబ్లీ హాల్‌లో రెక్కా సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం రెడ్‌క్రాస్ సంస్థ ఉచితంగా రక్తదానం చేస్తుందని వారి కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఆంజనేయులు, డీఈలు ఉత్తం, వెంకటరమణ, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి రవీందర్, డాక్టర్ శ్రీశైలం, పీవో పోశెట్టి, విద్యుత్ జేఏసీ నాయకులు గంగాధర్, సురే ష్ కుమార్, గంగారాం, మారెల్లి అశోక్, కాశీనాథ్, రాజేందర్ రెడ్డి, బాబా శ్రీనివాస్, మహేష్ కుమార్, శివ, రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంత రాయం ఉంటుందని టౌన్-1, టౌన్-2 ఏడీఈలు చంద్రశేఖర్, ప్రసాద్ రెడ్డిలు తెలిపారు. వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నెలవారి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుం దన్నారు. వినాయక్‌నగర్, హన్మాన్ జంక్షన్, ఓల్డ్ హౌసింగ్‌బోర్డు కాలనీ, 100ఫీట్ల రోడ్, ఇండియన్ పబ్లిక్‌స్కూల్, గూడెం, తుల్జాభవాని టెంపుల్, సాయికృపానగర్, యోగేశ్వరకాలనీ, ఇంద్రాణిస్కూల్, దత్తాత్రేయ ఆలయం, శ్రీనగర్, కోటగల్లి, గాయత్రీనగర్, పద్మానగర్, పులాంగ్, యెండల టవర్స్ దుబ్బ, గూపన్‌పల్లి, తిలక్‌గార్డెన్, పవరహౌస్, అర్సాపల్లి, మిర్చికంపౌండ్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి : బీఎల్‌పీ

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పాలని కేంద్ర హోంమంత్రిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన లెఫ్ట్‌పార్టీ, బహుజన కమ్యూనిస్టు బీఎల్‌పీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పులాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ మాట్లాడుతూ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై భారతజాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఒక కులానికో, మతానికో, ప్రాంతానికో ప్రతినిధి కాదని అన్నారు. అమిత్‌షాను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేకల రాజేందర్, దండుజ్యోతి, పద్మినివాగ్మారె, రాధబాయి, జీజబాయి, ప్రకాష్, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ బర్సాత్ ఆమేర్ అరెస్టు


బర్సాత్ ఆమేర్

ఖిల్లా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ నేరాలకు పాల్పడి పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న రౌడీషీటర్ అమర్ అలీఖాన్ అలియాస్ బర్సాత్ ఆమేర్‌ను ఐదో టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ప్రకటనలో తెలిపారు. ఆమేర్ వద్ద నుంచి ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై గంగాధర్, సిబ్బంది ఖిల్లా చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా బర్సాత్ ఆమేర్ ద్విచక్ర వాహనంపై వెళ్తుంగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బర్సాత్‌కు గతంలో హత్యాయత్నం, కిడ్నాప్, ఆస్తి నేరాలతో సహా 15 క్రిమినల్ కేసుల్లో ప్రమేయం కలిగి ఉన్నాడని తెలిపారు. అదే విధంగా ఏకే302 పేరుతో ముఠాను ఏర్పాటు చేసుకొని పలు నేరాలకు పాల్పడేవాడని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఇతనిపై 2020 సంవత్సరంలో పలువురిని బెదిరించిన కేసుల్లో నిందితుడిగా గుర్తించారు. 2023లో మరో రౌడీషీటర్ జంగల్ ఇబ్‌ను తమ అనుచరులతో కలిసి హత్య చేసిన కేసులో ముద్దాయిగా ఉన్నాడని తెలిపారు. అదేవిధంగా 2024లో సైతం పలువురిని కత్తులతో బెదిరించి కిడ్నాప్ చేసిన కేసుల్లో నిందితుడిగా పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. రౌడీషీటర్ల ఆగడాలను అరికట్టేందుకు పలువురిపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకుంటున్నామని నేరాలు చేసిన వారిని ఉపేక్షించేది లేదని ఇన్‌చార్జి సీపీ ప్రకటనలో తెలిపారు.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేటీఆర్‌పై కేసు

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందువల్లే కేటీఆర్‌పై కేసు నమోదైందని ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్ములా ఈరేస్ కేసులో రూ.55కోట్ల అవినీతి జరిగిందని గవర్నర్ ఆమోదం తెలపడంతో ఏ-1గా ఉన్న కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అన్నారు. కేటీఆర్ పై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. గత ఏడాది కాలంగా కేటీఆర్, హరీష్ రావులు వాస్తవాలను పక్కనబెడుతూ ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు. ఫార్ములా ఈరేస్‌లో భాగంగా కేటీఆర్ చేసిన అడ్డగోలు ఒప్పందాల వల్లనే ఈరోజు కేసు నమోదైందని ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీకి, మంత్రివర్గానికి సంబంధం లేకుండా కేవలం కేటీఆర్ పురపాలక మంత్రిగా విచక్షణ రహితంతో అధికారాన్ని వాడుకొని ఈరేసు నిర్వహించి అవినీతికి పాల్పడ్డారని అన్నారు. ఈరేసు వల్ల హైదరాబాద్ ప్రజలు ఎంత ఇబ్బందులు పడ్డారో అందరికి తెలుసన్నారు. ఫార్ములా ఈరేస్ ద్వారా కేటీఆర్ రూ.55కోట్ల అవినీతి చేశాడని ఏసీబీ కేసు నమోదు చేస్తే దీనిని శాసనసభలో చర్చించాలని పక్కదారి పట్టించే ప్రయత్నం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నారని అన్నారు. ఫార్ములా ఈరేస్ నిర్వహణలో ప్రభుత్వం కేవలం మధ్యవర్తిత్వం వహిస్తూ సదుపాయాలను అందించాలనే ఒప్పందం చేసుకుందని కానీ నిర్వహిస్తున్న కంపెనీల లాభనష్టాలకు ప్రభుత్వానికి సంబంధం లేదు అనే విధంగా ఒప్పందం చేసుకుంటే కంపెనీలకు 200 కోట్లు నష్టం రావడంతో కేటీఆర్ ప్రజాధనాన్ని రూ.55కోట్లు ధారాదత్తం చేశాడని అన్నారు. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని దీనిని ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు గమనించాలన్నారు. కేటీఆర్ అరెస్టు అయితే రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లు చేయాలనే సందేశాన్ని పంపుతున్నారని కానీ బీఆర్ఎస్ నాయకులు అల్లర్లు చేస్తే తమ పిల్లల జీవితాలు నాశనం అవుతాయనే విషయాన్ని గమనించాలన్నారు. కేటీఆర్ ఈ కేసును ఏసీబీ దగ్గర పరిష్కరించుకోవాలని అన్నారు. హరీష్‌రావు సంవత్సరానికి 600 కోట్లు అనగా 30 ఏళ్లకు 18వేల కోట్లు రింగ్ రోడ్‌ను కేవలం 7300 కోట్లకు ఏ విధంగా కాంట్రాక్టు ఇచ్చారో దీనిపై విచారణ కోసం ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని అన్నారు. కెసిఆర్ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని ఇష్టం వచ్చినట్లు దుర్వినియోగం చేసిందని పాపాలు పండినట్లు ఒక్కొక్కటిగా అవినీతి బయటపడుతుందన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని దేశానికి రాజ్యాంగాన్ని అందించి ఈరోజు ప్రతి ఒక్కరూ ఆ ఫలాలు పొందుతున్నారంటే అంబేద్కర్ చొరవేనని అన్నారు. కేంద్ర హోంమంత్రిగా అమిత్‌షా ఉండటం సిగ్గుచేటన్నారు. వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశవేణు, నాయకులు రత్నాకర్, సంతోష్, వేణురాజ్, నరేందర్‌గౌడ్, కేశమహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

● రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్


సమావేశంలో మాట్లాడుతున్న గడుగు గంగాధర్

ఖిల్లా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతు రుణమాఫీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణా రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐడీసీఎంఎస్ ప్రధాన కార్యలయంలో ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్ బదావత్ తారచంద్‌నాయక్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్లతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషన్ సభ్యుడు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరిగేలా చూస్తానన్నారు. ఈసమావేశంలో మాధవనగర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వర్‌రావ్, నిజామాబాద్ డీసీసీబీ బ్యాంకు అధికారులు లింబాద్రి, మేనేజర్ కే.నగేష్, ఉమ్మడి జిల్లాలోని సహకారా సంఘాల చైర్మన్లు, కార్యదర్శులు దయాసాగర్, నరసయ్య, మోహన్‌రావ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాతపరీక్షలను రద్దుచేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

ఖిల్లా, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాతపరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూర్జహాన్ పాల్గొని మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో 23ఏళ్లుగా పని చేస్తున్నా కనీస వేతనం ఇవ్వకుండా ఉద్యోగులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికి వీరిని రెగ్యులర్ చేయకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. 17-12-2024వ తేదీన డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్‌లో వందలాది మంది ఉద్యోగులు ధర్నా నిర్వహించినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదన్నారు. ఏఎన్ఎంలకు రాత పరీక్ష మినహాయించి రెగ్యులర్ చేయాలన్నారు. గతంలో సమ్మె సమయంలో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం 2023 సెప్టెంబరు 2న ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ కమిటీ ఏఎన్ఎంలతో చర్చించి సమగ్రంగా నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని ఉన్న ఆ కమిటీ రిపోర్టు లేకుండా రాత పరీక్ష తేదీ ప్రకటించడం వెనకాల ఉన్న ఆంతర్యమేమిటని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న 6500 మంది ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గంగా జమున, ప్రమీల, విక్టోరియా, సావిత్రి, సుమలత, పద్మ, విజయలక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

పెద్దరాంమందిర్ భూముల స్వాధీనం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దరాం మందిర్, సారంగపూర్ ఆలయాలకు సంబంధించిన భూములను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల 1491, 1492, 1495, 1496 సర్వే నెంబర్లతో ఉన్న భూములను దేవాదాయ శాఖ అధికారులు సర్వే చేసి స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెంబర్లలో ఉన్న నాలుగు ఎకరాల 22 గుంటలు, ఒక ఎకరం 8 గుంటలు, ఒక ఎకరం 25 గుంటలు, ఒక ఎకరం 36గుంటల ఏడిల్యాండ్‌ను సర్వే విభాగం యొక్క సర్వేయర్‌తో కలిసి సర్వే చేసి దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల, పెద్దరాంమందిర్ ఫిట్‌పర్సన్ వేణు దేవాదాయ శాఖ అధికారులతో కలిసి లెక్కించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్‌లు లక్ష్మణ్, సుమన్, ప్రశాంత్, ఆంజనేయులు, రఘునాథ్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.


వేడుకలు నిర్వహిస్తున్న టీఎన్‌జీవోస్ నాయకులు

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్‌లు ఎంతో సంబురంగా జరుపుకొనే క్రిస్మస్ వేడుకలను టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా సాగాయి. నగరంలోని టీఎన్‌జీవోస్ భవనంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ జార్జ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీఎన్‌జీవోస్ నాయకులతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా టీఎన్‌జీవోస్ ఉద్యోగ సంఘంలో మతసామరస్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టి ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించడానికి తోడ్పడుతాయని అన్నారు. జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ మాట్లాడుతూ.. టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ప్రతియేటా పండుగను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్, సహ అధ్యక్షులు నాగరాజు, చిట్టినారాయణరెడ్డి, కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్, అర్బన్ యూనిట్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు, క్రిస్టియన్ మైనార్టీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నుడా చైర్మన్ కేశవేణు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనం అనే గొప్ప లక్షణాలు ఎప్పటికీ అనుసరనీయమని, మత సామరస్యానికి ప్రతీకగా ప్రెస్‌క్లబ్‌లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలోని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో సెక్యూలర్ ప్రభుత్వంగా అన్ని మతాలకు సమ ప్రాధాన్యత నిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శేఖర్, సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ప్రకాశ్, తెలంగాణ యూనిటెడ్ పాస్టర్ అసోసియేషన్ ప్రసిడెంట్ ఆనంద్, డానియల్, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు

● నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఖిల్లా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పోలీసులు మహారాష్ట్రకు చెందిన అనుమానితుడు శ్రీహరిదేవిదాస్ శర్మ అలియాస్ హర్యాను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌చార్జి సీపీ సంధూశర్మ తెలిపారు. ఈనెల 19న రాత్రి ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న హర్యాను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారన్నారు. ఆయనను తనిఖీ చేయగా ఆయన వద్ద నాటుతుపాకీ లభించిందన్నారు. హర్యా మహారాష్ట్రలోని నాందేడ్‌లోని గోవర్ధన్‌ఘాట్‌లో నివాసం ఉంటాడని విచారణలో తేలిందన్నారు. హర్యాపై జిల్లా కేంద్రంలోని నాల్గోటౌన్‌లో రెండు చైన్‌స్నాచింగ్ కేసులు, మూడో టౌన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ, ఒకటో టౌన్ పరిధిలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో చైన్‌స్నాచింగ్‌తో పాటు వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కేసులు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఆరో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బర్సాత్‌ఆమెర్ గ్యాంగ్‌లో ముఖ్య అనుచరుడిగా ఉంటూ బైక్‌పై తిరుగుతూ ఒంటరి మహిళలమెడలో నుంచి బంగారు అభరణాలను అపహరించడం చేసే వాడని చెప్పారు. ఇటువంటి నేరాలు చేయడానికి బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు తన వద్ద 30వేల రూపాయల విలువ చేసే విదేశీ తుపాకీని కొనుగోలు చేశాడని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో నేరాలు చేయడానికి వచ్చి రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నేరాలు అంగీకరించడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి సీపీ సంధూశర్మ తెలిపారు.

డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఖిల్లా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో నమ్మించి మోసం చేసి రూ.25 లక్షలు తీసుకున్న వ్యక్తిని నాల్గవ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వినాయక్‌నగర్‌కు చెందిన ఓ మహిళ నుంచి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో వాణిజ్య దుకాణం ఇప్పిస్తామని షైమద్ ఖాన్ అనే వ్యక్తి రూ25 లక్షలు తీసుకొని మోసం చేశాడని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్నాయని ఎవరేం చేయరని బెదిరించాడని ఫిర్యాదులో తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి షైమద్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

విరివిగా పంట రుణాలు ఇవ్వాలి..

(మూడో పేజీ తరువాయి)

ఖరీఫ్ సీజన్‌లో రూ.2437 కోట్ల రుణాలకు గాను 1801.72 కోట్లు పంపిణీ చేసి 73.94 లక్ష్యాన్ని సాధించారని రబీ సీజన్‌లో 95.11 శాతం లక్ష్యసాధన జరిగిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రతిపాదించిన మేరకు సిరికొండ మండలం చీమన్‌పల్లి, ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామాలలో బ్యాంకు శాఖలను ఏర్పాటు చేసేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఇబ్బంది లేకుండా ఉండేందుకు రైస్‌మిల్లర్లకు పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ గ్యారంటీలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర పశుసంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖలు సమన్వయంతో ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలన్నారు. గ్రామాల్లో డిజిటల్ సేవలతో పాటు బ్యాంకింగ్ ఆధార్ సేవలను అనుసంధానం చేస్తూ వంద మంది నిరుద్యోగులకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద ఉపాధి అవకాశం కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఉపయోగపడుతాయన్నారు. ఇందిరా మహిళా శక్తి కింద పొదుపు సంఘాలకు, సభ్యులకు ఈ ప్రాజెక్టు ద్వారా ఉపాధి కలుగుతుందన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకొని అర్హులైన అభ్యర్థులకు యూనిట్ల స్థాపన కోసం బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలన్నారు. నిజామాబాద్‌లో నూతనంగా నెలకొల్పుతున్న మోడల్ సీఎస్‌సీ-ఐసిటిలకు సంబంధించిన గోడప్రతులను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీవో పృథ్వీ, డీఆర్‌డీవో సాయాగౌడ్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్, మెప్మాపీడీ రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోషక అభియాన్ కార్యక్రమాలు జయప్రదం చేయాలి..

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సహకరించినప్పుడే పోషక అభియాన్ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా న్యూట్రిషియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, పిల్లల యొక్క పోషణ స్థాయి మెరుగుపడాలంటే అందరూ ఆ దిశగా పనిచేయాలన్నారు. అంగన్‌వాడిలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, భవన నిర్మాణాలను తొందరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో న్యూట్రిషియన్ కమిటీ సభ్యులు, సిడిపివోలు, సూపరింటెండెంట్‌లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఫార్ములా ఈ రేసు ద్వారా హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్

(మూడో పేజీ తరువాయి)

వెళ్తున్నాయన్నారు. మూసీ అభివృద్ధి పేరున వేలాది పేద వర్గాల ఇండ్లను కూల్చివేసేందుకు కుట్ర పన్ను తున్నారని ఆయన విమర్శించారు. అన్ని పరిశ్రమలు ఏపీకి తరలివెళ్లేందుకు సీఎం సహకరిస్తున్నారని ఆయన విమర్శించారు. గురువు సీఎంగా ఉన్న రాష్ట్ర అభివృద్ధికి రేవంత్ రెడ్డి ఊతమిస్తున్నాడని ఆయన ఆరోపించారు. కేటీఆర్ ఒక్కడిని జైలులో పెడితే బీఆర్ఎస్ దెబ్బతినదని, వేలాది మంది పోరాటాలు చేస్తారని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నూడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, పార్టీ నేతలు సుజిత్‌సింగ్ ఠాకూర్, రవిచందర్, సిర్పరాజు, దండుశేఖర్, సత్యప్రకాష్, ఇతర నేతలు పాల్గొన్నారు.

ధర్పల్లి జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగం

ధర్పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగం వరించింది. సిరికొండ మండలంలోని వాల్గోట్ గ్రామానికి చెందిన శ్రావణ్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించగా అదే గ్రామానికి చెందిన రవి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యాడు. కళాశాల అధ్యాపకుల కృషి వల్లే తాము ప్రభుత్వ ఉద్యోగాలు సాధించామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోగల జూనియర్ కళాశాలలో అధ్యాపకులు లాబిశెట్టి మహేష్, సురేష్ బాబు, మామిడి విఠల్, అర్చనలను సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని కార్పొరేట్ కళాశాలలో చదివిన విద్యార్థులకంటే ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులే అన్ని రంగాల్లో ముందుంటారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.

అయోధ్యకు తరలివెళ్లిన పాదుకలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రాముడి కోసం తయారు చేసిన 14 కిలోల బంగారు తాపర పాదుకలను అయోధ్యకు తరలివెళ్లాయి. నగరంలో శుక్రవారం భక్తులు పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామరాజ్యం సెంట్రల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడికి సమర్పించనున్న పాదుకలకు రామదాసు సురేష్, ఆత్మారాం మహారాజ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. అయోధ్యకు 14 రోజులలో చేరే విధంగా పాదయాత్రలో ఇందూరు పట్టణానికి వచ్చిన పాదుకలకు భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. నగరం నుండి ఈ పాదుకలు ఆర్మూర్ మీదుగా అయోధ్యకు చేరుకోనున్నాయి. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.180	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	రూ.185	రూ.270	రూ. 290

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78600	రూ.72500	రూ.910

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.00, 2.05, 6.10)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్క్రీన్-2 : ముఫాసా (తెలుగు 3డి) (10.10, 1.00)
: పుష్ప-2 (3.50, 10.45)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (7.55)
స్క్రీన్-3 : విడుదల-2 (10.00)
: బచ్చలమల్లి (1.35, 7.30, 10.30)
: యుఐ (4.35)
స్క్రీన్-4 : బచ్చలమల్లి (10.25)
: యుఐ (1.25, 7.55)
: విడుదల-2 (4.20, 10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1
: బచ్చలమల్లి (10.20, 4.20, 10.35)
: విడుదల-2 (1.10)
: పుష్ప-2 (7.00)
స్క్రీన్-2 : విడుదల-2 (10.10, 7.35)
: యుఐ (1.20, 10.30)
: పుష్ప-2 (4.00)
స్క్రీన్-3 : ముఫాసా (తెలుగు 3డి) (11.00, 5.00, 7.35)
: పుష్ప-2 (1.15, 10.00)

దేవి : బచ్చలమల్లి (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : విడుదల-2 (11.15, 2.15)
: ముఫాసా (6.15, 9.15)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్ : యుఐ (11.15, 2.15)
: విడుదల-2 (6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్